నిరుద్యోగులకు భరోసా ఏదీ?

కూటమి ప్రభుత్వం ఏర్పడితే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. లేకపోతే రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తాం. అంటూ ఎన్నికలకు ముందు చంద్రబాబు అండ్‌కో తెగ ఊదరగొట్టింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల పూర్తయింది. కానీ ఉద్యోగాలు, నిరుద్యోగ భృతిపై ఇప్పటి దాకా ఎలాంటి ప్రకటన చేయలేదు. చెప్పిన మాట నిలుపుకోవాలని నిరుద్యోగులంతా ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే తాము రోడ్డున పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – సాక్షిబృందం:

- అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలిస్తామన్న కూటమి నేతలు
- లేదంటే నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని హామీ
- ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్న యువత
- అధికారంలో చేపట్టి నెలగడుస్తున్నా పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఇళ్లు, నిరుద్యోగుల వివరాలు ఇలా...

నియోజకవర్గం	ఇళ్ల సంఖ్య	నిరుద్యోగుల సంఖ్య
హిందూపురం	89,269	75,051
పెనుకొండ	77,488	76,502
మడకశిర	86,724	86,200



ఏమీ చెప్పకపోతే ఎలా?



నిరుద్యోగ భృతి అనేది మా లాంటి వారికి ఆర్థిక భరోసా ఇస్తుంది. ఎన్నికల హామీలో భాగంగా ప్రతి నిరుద్యోగికి రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి సభ్యులు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి నెల గడుస్తున్నా నేటికీ ఎలాంటి ప్రకటనా లేదు. తక్షణం ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– దినేష్‌రెడ్డి, ఎంబీఏ, చిలమత్తూరు

ప్రభుత్వ తీరు శోచనీయం



నేను ఎమ్మెస్సీ అగ్రికల్చర్ పూర్తి చేశాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల మ్యానిఫెస్టులో పెట్టడంతో ఆశపడి కూటమికి నాలాంటి నిరుద్యోగులు ఓటు వేశారు. అయితే ఎన్నికల్లో గెలిచిన తరువాత ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

– సుస్మిత, ఎమ్మెస్సీ అగ్రికల్చర్ , గోరంట్ల

నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే



నేను ఇంటర్ వరకు చదువుకున్నాను. ప్రస్తుతం ఓ షాప్‌లో పని చేస్తున్నాను. చంద్రబాబు ఎన్నికల్లో హామీల్లో ప్రతి నిరుద్యోగికి నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. లేకపోతే ఉద్యోగ అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చాడు. హామీ అమలు చేసి మాట నిలుపుకుంటే ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయి.

– అబ్దుల్, పెనుకొండ మండలం

ఇచ్చిన హామీ నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నెల పూర్తయినా ఇంత వరకూ ఉద్యోగాలు, నిరుద్యోగ భృతిపై నిర్ణయం తీసుకోలేదు. ఉద్యోగం లేక ఇంటి వద్దే ఉంటున్నా. మాలాంటి వాళ్లను ఆదుకోవాలి.

– పవన్‌కుమార్, బీఎస్సీ, రొళ్ల

ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నా..



గత ఎన్నికల సమయంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నిరుద్యోగ యువతకు ఇంటికో ఉద్యోగం ఇస్తానని మాటిచ్చారు. అధికారంలోనికి వచ్చి నెల కావస్తున్నా ఇంత వరకూ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. నేను ఇంటర్ పూర్తి చేసుకున్నా ఉపాధి లేక ఇంటిలోనే ఉంటున్నా.

– యోగేశ్వర్, నిరుద్యోగి, ఆలదపల్లి, అమరాపురం

కుటుంబం నాపై ఆధారపడింది



ఉద్యోగం దొరక్క ఇన్నాళ్లూ మా తల్లిదండ్రులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నా. ప్రస్తుతం నాకు వివాహమైంది. భార్యతో పాటూ కుమారుడూ ఉన్నాడు. తల్లిదండ్రులు కూడా వయోభారంతో ఉన్నారు. ప్రస్తుతానికి నాపైనే కుటుంబమంతా ఆధారపడి ఉంది. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నాకు ఉద్యోగం కల్పించాలి.

– హరీష్‌కుమార్‌రెడ్డి, ముల్లమొతుకపల్లి, పరిగి మండలం

నిరుద్యోగులను ఆదుకోవాలి



నేను డిగ్రీ పూర్తి చేశాను. ఉద్యోగం లేకపోవడంతో ప్రస్తుతం ఇంటి వద్దనే ఖాళీగా ఉంటున్నాను. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు చెప్పినట్లు 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలి. లేకపోతే చెప్పినట్లుగా నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇచ్చి నాలాంటి నిరుద్యోగులను ఆదుకోవాలి.

– నవ్య, డిగ్రీ , మావటూరు, పెనుకొండ మండలం

గతంలో మాదిరి చేయొద్దు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగం వచ్చే వరకూ నిరుద్యోగ భృతి చెల్లిస్తామన్నారు. 2014లో మాదిరి చేయకుండా వెంటనే నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇచ్చి చెప్పిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– నగేష్ ,ఎంఏ, బీఈడీ, మడకశిర

ఆశగా ఎదురుచూస్తున్నా...



నేను 2011లో ఎంబీఏ పూర్తి చేశాను. 2019 నుంచి 2024 వరకూ వలంటీర్ పనిచేశాను. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ఇంటికో ఉద్యోగం ఉద్యోగ కల్పించకపోతే రూ 3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నాము. నిరుద్యోగ భృతి కోసం ఆశగా ఎదురుచూస్తున్నా.

– అర్చన, ఎంబీఏ, తురకలాపట్నం, రొద్దం మండలం

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు భృతి ఇస్తానని హామీ ఇచ్చారు. నిరుద్యోగ భృతి కోసం చాలా మంది యువత, నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామి మేరకే వెంటనే నిరుద్యోగ భృతి అందించాలి. రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి.

– తరుణ్, హిందూపురం

మాట తప్పితే రోడ్డున పడతాం



చంద్రబాబు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఉద్యోగం కల్పించే వరకూ నిరుద్యోగ భృతి ఇవ్వాలి. డిగ్రీ పూర్తి చేసినా నాకు ఉద్యోగం లేదు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పితే నిరుద్యోగుల జీవితాలు రోడ్డున పడతాయి. ప్రభుత్వం నాలాంటి వారికి వెంటనే ఉద్యోగాలు కల్పించాలి.

– అశోక్‌రెడ్డి, శ్యానిగానిపల్లి, చిలమత్తూరు మండలం

భృతి ఇస్తారో? లేదో?



ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడి నెల గడిచిన ఆ ఊసే ఎత్తడం లేదు. ఇంటికో ఉద్యోగం అన్నారు. ఏమీ చెప్పడం లేదు. అసలు భృతి అయిన ఇస్తారా లేదా అన్న అనుమానంగా ఉంది. నిరుద్యోగులకు న్యాయం చేసేలా నిర్ణయం తీసుకోవాలి. రూ.3 వేల నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి.

– అఖిల, సోముందేపల్లి

పొలాలకు వెళ్లేందుకు రస్తా వదలండి

పుట్టపర్తి అర్బన్: పొలాలకు వెళ్లే రస్తాకు అడ్డుగా ఓ రైతు పెద్ద బండరాళ్లను వేసి రాకపోకలు అడ్డుకుంటున్నారని గోరంట్ల మండలం డి.గంగంపల్లికి చెందిన రైతులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన గౌని రామక్రిష్ణప్ప తనకున్న పొలాన్ని 2011లోనే సుబ్రమణ్యం అనే క్వారీ యజమానికి విక్రయించారన్నారు. సదరు సుబ్రమణ్యం 2023లో మరో రైతు లక్ష్మీనారాయణ భార్య లలితమ్మకు విక్రయించారని తెలిపారు. అయితే ఆ భూమి తనకే అమ్మాలని, పాత ధరకే అమ్మాలని పట్టుబట్టిన పూర్వ యజమాని గౌని రామక్రిష్ణప్ప రోడ్డుకు అడ్డుగా పెద్ద బండరాళ్లను వేసి అడ్డుకుంటున్నారన్నారు. ప్రస్తుతం వర్షాలు కురిసి పొలాల్లోకి వెళ్లడానికి రస్తా లేక 50 మందికి పైగా రైతులు ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇదివరకే గోరంట్ల తహసీల్దార్, సర్వేయర్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. తమ పొలాల్లోకి వెళ్లేందుకు రస్తా విడిపించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వార్డు సచివాలయం తనిఖీ

మడకశిర: పట్టణంలోని సాయినగర్ వార్డు సచివాలయాన్ని సోమవారం పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ తనిఖీ చేశారు. వివిధ రికార్డులను పరిశీలించారు. 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం కొందరికి శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేసింది. ఆ పత్రాల పరిశీలించే ప్రక్రియపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమయ పాలన పాటించక పోతే చర్యలు తప్పవని ఉద్యోగులను హెచ్చరించారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

పెనుకొండ: కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో రజక సంఘం నాయకుడు చాకలి శ్రీనివాసులుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా రజక సంఘం ఉపాధ్యక్షుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనుక మాజీ మంత్రి హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఎంతటి వారున్నా పోలీసులు కఠిన చర్యలు చేపట్టి దోషులను శిక్షించాలని కోరారు.

నరికేసిన చెట్ల పరిశీలన

రొద్దం: మండల పరిధిలోని పెద్దగువ్వలపల్లి గ్రామ సమీపంలో ప్రభుత్వం ఆధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో ఏళ్లుగా పెంచిన నీలగిరి చెట్లను కొందరు అక్రమంగా నరికేసి అమ్ముకున్నారు. దీంతో అగ్రిగోల్డ్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ రాజ్‌గోపాల్‌రెడ్డి ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం సీఐడీ అధికారుల దేశాల మేరకు ఎస్‌ఐ వలీబాషా చెట్లును నరికిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడి వివరాలను సీఐడీ అధికారులకు నివేదిస్తామన్నారు.

ట్రిపుల్ ఐటీకి 22 మంది ఎంపిక

పరిగి:మండలంలోని ఏపీ గురుకుల ప్రతిభావంతుల ఆశ్రమ పాఠశాల (ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్)కు చెందిన 22 మంది విద్యార్థులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న కళాశాలల్లో ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్వీ మురళీధర్‌బాబు తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన మహేష్‌బాబు (596), యశ్వంత్ (593) ఇద్దరితో పాటు మరో 20 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. వారందరికీ పాఠశాల తరపున అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.

గుట్టూరులో...

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరులోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి నరేష్ ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు నాగార్జునుడు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలోనూ 568 మార్కులతో నరేష్ రాణించాడన్నారు.

దుర్గాభాయి దేశ్‌ముఖ్‌కు ఘన నివాళి



దుర్గాభాయి దేశ్‌ముఖ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

హిందూపురం టౌన్: స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త దుర్గాభాయి దేశ్‌ముఖ్ జయంతి వేడుకలను సోమవారం పట్టణంలోని దుర్గాభాయి దేశ్‌ముఖ్ పురపాలక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాభాయి దేశ్‌ముఖ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసిన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప , హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే తిమ్మారెడ్డికి నివాళి

మడకశిర: పట్టణంలోని సరస్వతీ విద్యామందిరం ఉన్నత పాఠశాలలో సోమవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే వై తిమ్మారెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి తిమ్మారెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ,కార్యదర్శి హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఈరలక్కప్ప

మడకశిరరూరల్: మండల పరిధిలోని చందకచెర్లు పంచాయతీలోని ఎగువ అచ్చంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయ రామాంజప్ప అల్లుడు ప్రకాష్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త ఈరలక్కప్ప అచ్చంపల్లికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్యపడొద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

బ్యాటరీల చోరీ

అగళి: మండల పరిధిలోని మాధుడి గ్రామంలోని వోడాఫోన్ సెల్ టవర్‌లో అమర్చిన 48 బ్యాటరీలను దుండగులు ఎత్తుకెళ్లినట్లు ఆ కంపెనీ ప్రతినిధులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బ్యాటరీల విలువ రూ.2 లక్షలు ఉంటుందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరేష్ తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్

మడకశిర: నియోజకవర్గంలోని డీఎస్సీ, ఎస్‌జీటీ అభ్యర్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ అన్నారు. పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఆయన డీఎస్సీ, ఎస్‌జీటీ అభ్యర్థుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అధ్యక్షత వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ డీఎస్సీ, ఎస్‌జీటీ అభ్యర్థులు ఉపయోగించుకొని ఉపాధ్యాయులుగా ఎంపికవ్వాలన్నారు.

రేపు వీరచిన్నస్వామి జాతర

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లిలో వీరచిన్నయ్యస్వామి జాతర మహోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం జ్యోతుల ఉత్సవం, సాయంత్రం ఎద్దుల బండ్ల ప్రదర్శన ఉంటుందన్నారు. రాత్రికి ఉత్సవ విగ్రహం ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



పరిగి: పెద్దాయిప్ప ఆలయంలో కొలువుదీరిన పీర్లస్వాములు



రొళ్ల మండలం రత్నగిరిలోఅగ్నిగుండాన్ని సిద్ధం చేస్తున్న భక్తులు



ఆలుడిలో కొలువుదీరిన పీర్లు

పరిగి:మండలంలోని అన్ని గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం అగ్నిగుండం మండించే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరిలోని పాత ఊరులో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పీర్ల ఆయా గ్రామాల్లో ఆనందోత్సాహాల మధ్య ఊరేగించారు. మంగళవారం అగ్నిగుండం మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అగళి: మండల పరిధిలోని ఆలుడి గ్రామంలో మొహర్రంలో భాగంగా పీర్లు కొలువు దీరాయి. భక్తులు పీర్లస్వాములకు పెద్ద ఎత్తున చక్కర చదివిస్తూ మొక్కులు తీర్చుకుంటున్నారు.

నిధుల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ

- డీఎల్‌పీఓ, ఎంపీడీఓకు సబ్‌కలెక్టర్ ఆదేశం

చిలమత్తూరు: 'కొంచెం నీకు .. కొంచెం నాకు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ స్పందించారు. మొరసపల్లి, చాగలేరు, చిలమత్తూరు పంచాయతీల్లో ఏ పనులకు ఎంత నిధులు వాడారు? బిల్లు సరైనవా? లేక ఫేక్ బిల్లులు సృష్టించారా? అనే అంశాలపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని డీఎల్‌పీఓ, ఎంపీడీఓకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే సాకీ బాయ్ ఎవరనే విషయంపైనా ఆయన ఆరా తీసినట్లు తెలిసింది. డీఎల్‌పీఓ శివారెడ్డి మాట్లాడుతూ నిధులు దుర్వినియోగం, గోల్‌మాల్ వ్యవహారంపై దర్యాప్తు చేయనున్నట్లు 'సాక్షి'కి తెలిపారు. మరోవైపు పంచాయతీ కార్యదర్శి రామ్లానాయక్ తనకు మిత్రుడైన ఎంపీడీఓ రామ్‌కుమార్ ద్వారా ఈ సమస్యను బయట పడేందుకు యత్నిస్తున్నట్లు తెలిసింది. విచారణ నివేదిక తనకు అనుకూలంగా ఇచ్చేలా ప్రణాళిక వేశారని సమాచారం.

సాక్షి ఎఫెక్ట్..

పారిశుధ్యం మెరుగునకు చర్యలు



మురుగు నీటిపై ఆయిల్ చల్లుతున్న వైద్య సిబ్బంది

పెనుకొండ రూరల్: 'పడకేసిన పారిశుధ్యం' శీర్షికన సోమవారం 'సాక్షి'లో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. దుద్దేబండ పంచాయతీలోని గ్రామాల్లో పరిశుభ్రత పనులకు శ్రీకారం చుట్టారు. మురుగు కాలువలు, నీటి గుంటలలో వేస్ట్ ఆయిల్ చల్లి దోమలు వ్యాపించకుండా నివారణ చర్యలు చేపట్టారు. అనంతరం ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

ప్రభాస్ అభిమానుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న ప్రభాస్ అభిమానులు

హిందూపురం టౌన్: హీరో ప్రభాస్ నటించిన కల్కి చిత్రం రూ. వెయ్యి కోట్ల కలెక్షన్లు సాధించడంతో హిందూపురం ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. సోమవారం కల్కి సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్ వద్ద కేక్ కట్ చేసి, ప్రభాస్ కటౌట్‌కు క్షీరాభిషేకం చేశారు. ప్రభాస్ టౌన్ వైడ్ అధ్యక్షుడు సడ్లపల్లి వెంకటేష్‌రెడ్డి , అభిమానులు పాల్గొన్నారు.

దేవలకెరెలో అంబేడ్కర్ జయంతి వేడుకలు

పావగడ: తాలూకాలోని దేవలకెరె గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. అధిక సంఖ్యలో మహిళలు జ్యోతులు మోశారు.